క్లుప్తంగా

డెమో రైలును గిద్దలూరుకు పొడిగించాలి



స్టేషన్ మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గిద్దలూరు రూరల్: తిరుపతి నుంచి నంద్యాల వరకు, కర్నూలు నుంచి నంద్యాల వరకు, తెనాలి నుంచి మార్కాపురం వరకు ఉన్న డెమో రైలును గిద్దలూరు వరకు పొడిగించాలని కోరుతు బీజేపీ నాయకులు మంగళవారం గిద్దలూరు రైల్వే స్టేషన్ మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మార్కాపురం, నంద్యాలకు కేవలం 60 కిలోమీటర్ల దూరంలోనే ఉన్న గిద్దలూరుకు ఆ మూడు డెమో రైళ్లను పొడగించడం వల్ల ఈ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నేతుల అప్పిశెట్టి ఉదయ్ శంకర్, చక్రి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

దీన్‌దయాల్ ఉపాధ్యాయకు ఘన నివాళి



దీన్‌దయాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

మార్కాపురం టౌన్: భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ వర్ధంతిని స్థానిక బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. దీనదయాల్ చిత్రపటానికి బీజేపీ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాదర్తి ఆంజనేయులు, బొంతలకృష్ణ, చిన్నయ్య,చంద్రశేఖర్, సతీష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

15న కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం



రైతులకు సూచనలిస్తున్న ఏఓ వెంకటేశ్వర్లు

తర్లుపాడు: మండల కేంద్రం తర్లుపాడులో ఈనెల 15 నుంచి కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు ఏఓ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం మండలంలోని చెన్నారెడ్డిపల్లి, తర్లుపాడు గ్రామాల్లో పంటలను పరిశీలించారు. ఫార్మర్ రిజిస్ట్రీ ప్రయోజనాలను వివరించారు. వేసవిలో పశువుల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ ఎం.నందన పశుపోషకులకు తెలియజేశారు. కార్యక్రమంలో సిబ్బంది దేవేంద్ర, విష్ణు, గోవింద్ బాషా పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లో కాపర్ రాడ్లు అపహరణ

పొదిలి రూరల్: మండలంలోని ఉప్పలపాడు 400 కేవీ సబ్‌స్టేషన్‌లో 250 కేజీల కాపర్‌రాడ్లు అపహరణకు గరయ్యాయి. దీనిపై మంగళవారం పొదిలి పోలీసు స్టేషన్‌లో ట్రాన్స్‌కో ఏఈ హరీష్ ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేసునట్లు ఎస్సై వేమన తెలిపారు.

మినుము, కంది మద్దతు ధరపై రైతుల బెంగ

- కందికి సర్కారు మద్దతు కేవలం రూ.7,550
- గత ఏడాది మాత్రం రూ.9,000
- వ్యాపారుల సిండికేట్‌తో రూ.6 వేలు మించని మినుము ధర
- గత డిసెంబర్‌లో రూ.7 వేలకు పైగా పలికి ఇప్పుడు ఢమాల్
- మార్కెట్ మాయాజాలం, సర్కారు తీరుపై రైతుల ఆందోళన



దళారులకు రొక్కం.. రైతుకు దుఃఖం!



మినుములు కాటా వేస్తున్న కూలీలు

కొనకనమిట్ల:

ఆరుగాలం కష్టపడిన రైతులను దోపిడీ చేసేందుకు దళారులు సిద్ధమయ్యారు. రైతుల శ్రమను గుర్తించి 'మద్దతు'గా నిలవాల్సిన ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించకుండా చోద్యం చూస్తోంది. గత ఏడాది వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రకటించిన గిట్టుబాటు ధర కంటే ఈ ఏడాది ధరలు తక్కువగా ఉండటం, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంట ఉత్పత్తులను సైతం వ్యాపారులు మరీ తక్కువకు అడగుతుండటంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఇదే పరిస్థితి కొనసాగితే పెట్టుబడి కూడా చేతికొచ్చేలా లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కొనకనమిట్ల మండలంలో మినుము, అలసంద, కంది తదితర మెట్ట పైర్లు అత్యధిక విస్తీర్ణంలో సాగు చేశారు. అలసంద, మినుము పంటలు సుమారు 14 వేల ఎకరాలకు పైగా, కంది 22 వేలకు పైగా ఎకరాల్లో సాగైంది. అలసంద ఎకరాకు 3 నుంచి 4 క్వింటాల వరకు, మినుము 2 నుంచి 3 క్వింటాల వరకు దిగుబడి వచ్చింది. కంది పంట దిగుబడి సైతం సరాసరిన 2 క్వింటాళ్లకు మించడం లేదు. డిసెంబర్ నెలలో కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతినడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది.



ట్రాక్టర్‌తో పంట నూర్పిడి చేస్తున్న రైతులు

ముమ్మరంగా కోత పనులు

గత ఖరీఫ్, రబీలో సాగు చేసిన పలు రకాల పంటలు కోతకు రావటంతో ప్రస్తుతం వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పశ్చిమ ప్రాంతంతలో మినుము, బొబ్బర్లు(అలసంద), కంది కోతలతో కూలీలకు డిమాండ్ పెరిగింది. ఈ ఏడాది కూలి ధరలు పెరగడంతో ఒక్కొక్కరికి రూ.500 నుంచి 600 వరకు ఇవ్వాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు.పొదిలి, హనుమంతునిపాడు, బేస్తవారిపేట, దొనకొండ, తర్లుపాడు మండలాల నుంచి కొనకనమిట్లలోని పలు గ్రామాలకు వాహనాల్లో కూలీలను రప్పించి పనులు చేయిస్తున్నారు. ఎక్కువ కూలి ఇచ్చినా కూలీలు దొరక్క పలు గ్రామాల్లో యంత్రాలతో పంటలు కోయిస్తున్నారు. పంట సాగు దశ నుంచి కోత వరకు అన్ని ఖర్చులు పెరిగాయి కానీ పండించిన పంటకు గిట్టుబాటు ధర మాత్రం దక్కడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మద్దతు తగ్గింపుపై నిరాశ

గతంలో కన్నా ఈ ఏడాది వ్యవసాయ ఖర్చులు పెరగడం, దిగుబడి తగ్గిన నేపథ్యంలో పంటలకు సరైన గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అలసందలు, మినుములు క్వింటా ధర ఇటీవల వరకు రూ.7 వేలకు పైగా ఉంది. తీరా పంట చేతికొచ్చిన తర్వాత వ్యాపారులు క్వింటా రూ.6 వేలకు అడుగుతుండటంతో రైతులు హతాశులయ్యారు. మార్క్‌ఫెడ్ ద్వారా కందులు కొనుగోలు చేస్తామని కొనుగోలు కేంద్రాలను ప్రకటించిన ప్రభుత్వం.. మద్దతు ధరను రూ.7,550కి పరిమితం చేయడంతో రైతులు నిరాశకు గురయ్యారు. గత ఏడాది రూ.9 వేల వరకు పలికిన కందుల ధరను ఈ ఏడాది ప్రభుత్వమే కుదించడాన్ని రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. కందుల కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఇప్పటికీ ప్రారంభించకపోవడంతో దళారులు అడిగిన ధరకు ఇచ్చేయాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న టిప్పర్

- మార్కాపురం మార్కెట్ యార్డు సమీపంలో ఘటన
- ఏడు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం



విరిగిన విద్యుత్ స్తంభం

మార్కాపురం: స్థానిక మార్కెట్ యార్డు సమీపంలో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని మంగళవారం ఓ టిప్పర్ ఢీకొట్టడంతో పూర్తిగా ఒరిగిపోయింది. అయితే ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కాగా మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఆర్టీసీ డిపో ఏరియా, జవహర్‌నగర్ కాలనీ, కాలేజీ, తూర్పువీధి, జగదీశ్వరి థియేటర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సమాచారం తెలుసుకున్న డీఈ సియా నాయక్ తమ సిబ్బందితో మరమ్మతులు చేయించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

అర్జీలను వెంటనే పరిష్కరించాలి



మాట్లాడుతున్న వెలుగొండ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎంవీ శివరామిరెడ్డి

కొమరోలు: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను త్వరితంగా పరిష్కరించాలని వెలుగొండ ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్ ఎంవీ శివరామిరెడ్డి ఆదేశించారు. కొమరోలులోని తహసీల్దార్ కార్యాలయాన్ని వెలుగొండ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వీఆర్‌ఓలు, సర్వేయర్లతో రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 15వ తేదీలోగా అర్జీలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని, అర్జీదారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగనివ్వవద్దని స్పష్టం చేశారు. మండలంలో మొత్తం 620 అర్జీలు రాగా 531 అర్జీలు పరిష్కారమయ్యాయని, 81 అర్జీలు పరిష్కరించాల్సి ఉందని తహసీల్దార్ భాగ్యలక్ష్మి వివరించారు. అనంతరం స్పెషల్ కలెక్టర్ మాట్లాడుతూ.. పొలాలు కొనే వారు, అమ్మే వారు ఫొటోతో సహా ఆన్‌లైన్‌లో పొందుపరిచినట్లయితే ఎవరికీ ఇబ్బంది లేకుండా ఉంటుందని తెలిపారు.

వైఎస్సార్ సీపీ నాయకురాలికి ఘన నివాళి



రమాదేవి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కల్పన

గిద్దలూరు రూరల్: పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకురాలు బెల్లం రమాదేవికి మంగళవారం గిద్దలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కె.పి.నాగార్జునరెడ్డి సతీమణి కల్పన ఘన నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇటీవల యడవల్లి క్రాస్ రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన రమాదేవి కర్నూలులో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. ఎన్నికల సమయంలో బెల్లం రమాదేవి ఎంతో శ్రమించిందని కేపీ సతీమణి కొనియాడారు. ఆమె మరణం పార్టీకి తీరని లోటు అని విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కాతా దీపిక, కౌన్సిలర్లు బాలిరెడ్డి, దొంత లక్ష్మీదేవి, వైఎస్సార్ సీపీ నాయకులు వేమిరెడ్డి రామచంద్రారెడ్డి, చేగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, పాలుగుళ్ల నరసింహారెడ్డి, సునీల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, మత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

- బేస్తవారిపేటలో దర్గా రోడ్డు వెంట విలువైన ప్రభుత్వ స్థలాలు ఆక్రమణ
- ఏమీ తెలియనట్టుగా నిద్ర నటిస్తున్న రెవెన్యూ అధికారులు

కళ్లు మూసుకున్నాం.. కబ్జా చేసుకోండి!



సిమెంట్ బ్రిక్స్‌తో గోడకట్టి ఆక్రమణ

బేస్తవారిపేట: విలువైన ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నా రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారు. 'మేం కళ్లు మూసుకుంటాం.. మీరు దర్జాగా భూములు ఆక్రమించుకోండి'అన్నట్లుగా ఉంది అధికారుల తీరు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా విలువైన స్థలాలను కాపాడాల్సిన అధికారులు ఏమీ పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రమైన బేస్తవారిపేటలో దర్గా రోడ్డుకు ఒక వైపున ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. వీరాంజనేయస్వామి ఆలయం సమీపంలో, డ్వామా సీఎల్‌ఆర్‌సీ భవనం సమీపంలో రోడ్డు పక్కన లక్షల రూపాయల విలువైన ప్రభుత్వ స్థలాలున్నాయి. ఈ భూములపై కన్నేసిన అక్రమాలు యథేచ్ఛగా ఆక్రమిస్తున్నా రెవెన్యూ అధికారులు కిమ్మనడం లేదు. ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవుతున్నా రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లుగా ఉండటంలో ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సీఎల్‌ఆర్‌సీ భవనం సమీపంలో కొండ పక్కన ఒక్కొక్కరు 10 నుంచి 20 సెంట్లు ఆక్రమించుకున్నారు. ఆ స్థలం చుట్టూ ప్రహరీ కట్టుకోవడం, కొండ చరియలను తొలగించడం, గుంతలను పూడ్పించడం లాంటివి చేస్తున్నారు. ఇంత తతంగం జరుగుతున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడం గ్రామస్తుల్లో అనుమానాలకు తావిస్తోంది. ఆక్రమణదారులతో అధికారులు కుమ్మక్కై చూసీచూడనట్లు ఉంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బేస్తవారిపేట మేజర్ పంచాయతీలో విలువైన ప్రభుత్వ భూములు దరగా రోడ్డు ప్రాంతంలో మాత్రమే ఉన్నాయి. ఉన్న కొద్దిపాటి స్థలం ఆక్రమణలకు గురవుతుండటంతో భవిష్యత్‌లో ప్రభుత్వ భవనాలు, ఇతర అవసరాలకు స్థల సమస్య ఏర్పడుతుందని, అధికారులు స్పందించి అడ్డుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వ భూములకు రిజిస్ట్రేషన్!

కొందరు అక్రమార్కులు అసైన్‌మెంట్ స్థలాన్ని ఆక్రమించుకోవడమే కాకుండా తప్పుడు సర్వే నంబర్‌తో రిజిస్ట్రేషన్ కూడా చేయించుకుంటున్నారని, కొందరైతే ఆక్రమిత స్థలాల్లో దర్జాగా గృహాలు నిర్మించుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి.



ఆక్రమిత స్థలంలో చదును చేసేందుకు తోలిన రాళ్లు



కొండచరియలు తవ్వి ఆక్రమణ

తర్లుపాడు పీహెచ్‌సీలో డీఎంహెచ్‌ఓ తనిఖీ



గర్భిణులతో మాట్లాడుతున్న డీవైఎంహెచ్‌ఓ పద్మావతి

తర్లుపాడు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీవైఎంహెచ్‌ఓ డాక్టర్ పద్మావతి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గర్భిణులతో మాట్లాడి ఐరన్ మాత్రలు అందజేశారు. రక్తహీనత ఉన్న గర్భిణులను మార్కాపురం జీజీహెచ్‌కు తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో తరలించారు. వైద్యశాలలోని రికార్డులు పరిశీలించారు. ఎన్‌సీడీ స్క్రీనింగ్, ఆర్‌బీఎస్‌కే స్క్రీనింగ్, ఎల్‌సీడీసీ, ఆర్‌సీహెచ్ పనితీరు గురించి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరీష్‌ను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలన్నారు. ఏఎన్‌ఎమ్‌లు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

క్యూరింగ్ సమయంలో అప్రమత్తంగా ఉండాలి



పొగాకు అల్లకాన్ని పరిశీలిస్తున్న బోర్డు అధికారులు

పొదిలి: పొగాకు క్యూరింగ్ కీలక దశలో రైతులు అప్రమత్తంగా ఉండాలని టుబాకో బోర్డు సెక్రటరీ దివి వేణుగోపాల్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కంభాలపాడు, పోతవరం గ్రామాల్లోని పొగాకు తోటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పచ్చాకు అల్లకం, క్యూరింగ్, ఆరుదల మండెలను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలిచ్చారు. సకాలంలో పక్వానికి వచ్చిన ఆకులను మాత్రమే రెలిచి క్యూరింగ్ చేసుకోవాలని చెప్పారు. అగ్ని ప్రమాదాలు సంభవించకుండా బీట్ గొట్టంపై జాలీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రేడింగ్ సమయంలో బేళ్లలో అన్య పదార్థాలు కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం పొగాకు వేలం కేంద్రంలో అభివృద్ధి పనులను పరిశీలించారు. వేలం త్వరలోనే ప్రారంభం కానున్న దృష్ట్యా ఈలోపు పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో దక్షిణ ప్రాంత తేలిక నేలల ప్రాంతీయ అధికారి ఎం.లక్ష్మణరావు, స్థానిక వేలం అధికారి గిరిరాజ్‌కుమార్, బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

నేరాల కట్టడికి ప్రత్యేక చర్యలు

- పోలీస్ పెట్రోల్ బంక్‌లను తనిఖీ చేసిన ఎస్పీ దామోదర్



పెట్రోల్ బంక్‌ను పరిశీలించి సూచనలు ఇస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు సిటీ: నేరాల కట్టడికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ ఏఆర్ దామోదర్ పేర్కొన్నారు. మంగళవారం ఒంగోలు, కొత్తపట్నం సెంటర్‌లో ఉన్న పోలీస్ వెల్ఫేర్ పెట్రోల్ బంక్‌లను ఎస్పీ తనిఖీ చేశారు. పెట్రోల్ బంక్ చుట్టూ ప్రదేశాన్ని, బంక్ నిర్వహణ, సిబ్బంది పనితీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పోలీస్ వాహనాలకు నిత్యం వినియోగించే డీజిల్, పెట్రోల్ నిర్వహణకు సంబంధించి అన్ని రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేసేలా చేసుకోవాలన్నారు. ట్రాఫిక్ కు ఎటువంటి అంతరాయం లేకుండా చూడాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. అనంతరం ఒంగోలు డీఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ ఎస్పీ తనిఖీ చేశారు. ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, టు టౌన్ సీఐ శ్రీనివాసరావు, వన్ టౌన్ సీఐ నాగరాజు, చీమకుర్తి సీఐ సుబ్బారావు, ట్రాఫిక్ సీఐ పాండు రంగారావు, ఆర్ఐ సీతారామిరెడ్డి సిబ్బంది ఉన్నారు.

హెల్మెట్ ధరించేలా అవగాహన కల్పించాలి

మద్దిపాడు: జిల్లాలో వాహనదారులందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపేవారు సీటు బెల్ట్ ధరించాలని, జిల్లా ఎస్పీ దామోదర్ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్ను సాధారణ తనిఖీల భాగంగా సందర్శించారు. ఇటీవల కాలంలో మద్యం ఆగి వాహనాలు నడిపే వారిని నియంత్రించడానికి జాతీయ రహదారిపై ప్రత్యేకమైన టీం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, ఏఎస్సై రమేష్ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు: పోలీస్ స్టేషన్‌లలో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ ఏఆర్. దామోదర్ ఆదేశించారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ అకస్మికంగా సందర్శించారు. స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించి స్టేషన్ శుభ్రతలకు అవసరమైన సూచనలు చేశారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు మిస్సింగ్ కేసుల్లో ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి అధునాతన సాంకేతికను ఉపయోగించి ఛేదించాలని ఆదేశించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో వివిధ రూమ్‌లు, ఉమెన్ హెల్ప్ డెస్క్‌తో పాటు వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఒంగోలు డీఎస్పీ శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ కె.శ్రీనివాసరావు, ఆర్ఐ సీతారామిరెడ్డి, ఎస్సై శ్రీకాంత్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

'మోడల్' నెపంతో పాఠశాలల కుదింపు ఆపాలి

ఒంగోలు సిటీ: ప్రభుత్వం మోడల్ ప్రైమరీ పాఠశాలల నెపంతో విద్యార్థుల తరలింపు, పాఠశాలలను కుదించడాన్ని వెంటనే ఆపాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.వెంకటరావు, బి.అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం కావడం వల్ల పేద, మధ్య తరగతి పిల్లలు డ్రాపౌట్స్ గా మిగిలిపోయి విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కాబట్టి అన్ని పంచాయతీల్లో విద్యార్థుల సంఖ్యకు సంబంధం లేకుండా మోడల్ ప్రైమరీ పాఠశాలలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగుల బకాయిలు, రిటైర్ అయిన వారికి బెనిఫిట్స్ చెల్లించాలని కోరారు. పీఆర్సీ కమిషన్‌ను నియమించి, ఐఆర్ 30% ఇవ్వాలని డిమాండ్ చేశారు.